క్లుప్తంగా

నియామక ఉత్తర్వులు అందజేత



నియామక ఉత్తర్వులు అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలజోన్: జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్ పర్సన్ డ్రైవర్‌గా పనిచేసిన మోహిజ్ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా, శుక్రవారం ఆయన కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థికసాయంతో పాటు కారుణ్య నియామకం కింద ఆయన భార్యకు అఫీస్ సబార్డినేట్‌గా ఉద్యోగ నియామక ఉత్తర్వులను జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి, డిప్యూటీ సీఈవో రఘువరన్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా వ్యవహరిస్తే ప్రాణాలు దక్కుతాయి



సీపీఆర్ చేస్తున్న సిబ్బంది

జగిత్యాల: అప్రమత్తంగా వ్యవహరిస్తే ప్రాణాలు దక్కుతాయని ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రకృతి వైపరీత్యాలను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై అవగాహన కల్పించారు. కొన్ని సంఘటనలు అనుకోకుండా జరుగుతాయని, ఆసమయంలో చాకచక్యంగా వ్యవహరిస్తే ప్రాణాలు దక్కించుకోవచ్చన్నారు. మానవ తప్పిదాలతో వచ్చే ప్రమాదాల సమయంలో ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో క్రీడల అభివృద్ధి అధికారి రవికుమార్, ఎస్‌కేఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్ పాల్గొన్నారు.

క్షయ, ఎయిడ్స్ వ్యాధులపై కళా ప్రదర్శన



కళా ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

జగిత్యాలజోన్: జగిత్యాల అర్బన్ మండలంలోని మోతె గ్రామంతో పాటు జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్‌లో క్రాంతి కళాబృందం ఆధ్వర్యంలో క్షయ, ఎయిడ్స్ వ్యాధులపై శుక్రవారం కళా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మపాణి సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ రమేశ్ మాట్లాడుతూ క్షయ, ఎయిడ్స్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సంస్థ సూపర్ వైజర్ సుదర్శన్, ఏఎన్ఎంలు శిరీష, సంధ్యారాణి, రజిత, రాజేశ్వరి, గంగజల, జమున, గంగా భారతి, శారద, సుమలత, సుకన్య, హెల్త్ సూపర్ వైజర్ విజయ, పద్మ, స్వాతి, సుజాత పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

మేడిపల్లి: బాలికను అపహరించి అత్యాచారం చేసి, ఆమె ప్రాణాపాయ స్థితికి కారణమైన దుండగుడిని కఠినంగా శిక్షించాలని బాధితురాలి బంధువులు డిమాండ్ చేశారు. భీమారం మండలం వెంకట్రావుపేటకు చెందిన బాలికను సాయికుమార్ మాయమాటలతో తీసుకెళ్లి అత్యాచారం చేశాడని, వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాలని, నిందితుడి ఇంటి ముందు బంధువులు ధర్నా చేపట్టారు.

'కవిత అరెస్టు శుభసూచకం'



సంబరాల్లో బీజేపీ నాయకులు

జగిత్యాలటౌన్: ఎమ్మెల్సీ కవిత అరెస్టు శుభసూచకమని, తప్పు చేసినవారు ఎంతటివారైనా శిక్ష తప్పదని ఆమె అరెస్టుతో రుజువైందని బీజేపీ సీనియర్ నాయకుడు ఏసీఎస్ రాజు అన్నారు. లిక్కర్ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై కవిత అరెస్టుతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, ఎమ్మెల్సీ కవిత లిక్కర్ కేసులో అరెస్టు కావడం తెలంగాణ రాష్ట్రానికే తలవంపులు తెచ్చేలా ఉందన్నారు. నాయకులు లింగంపేట శ్రీనివాస్, విద్యా ఠాకూర్, నల్ల నారాయణరెడ్డి, బిట్టు పాల్గొన్నారు.





వరదకాలువలో అడుగంటిన నీరు

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్ల, ఊటిపెల్లి, కథలాపూర్ గ్రామాల శివారులో ఎస్సారెస్పీ వరదకాలువలో నీరు అడుగంటిపోయింది. ఈ కాలువపై ఆధారపడి వరి సాగుచేసుకున్న రైతులు నీళ్ల అందక పొలాలు ఎండిపోతాయేమోనని ఆందోళన చెందుతున్నారు. వరి పంటలను మూడు నెలలుగా అష్టకష్టాలు పడి కాపాడుకున్నామని, వరదకాలువ ద్వారా 10 రోజులు నీళ్ల వదిలితే తమ వరిపొలాలు గట్టెక్కుతాయని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం, నీటిపారుదలశాఖ అధికారులు చొరవ చూపి వరదకాలువ ద్వారా నీళ్ల వదలాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



చేతికొచ్చిన పంట.. గొర్రెలకు మేతగా..

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామశివారులో పలువురు రైతుల వరిపొలాలు ఎదిగి చేతికందే సమయంలో బోరుబావుల్లో చుక్క నీరు రాకపోవడంతో ఎండిపోతున్నాయి. పలువురు రైతులు మూడు నెలలు నీళ్ల అందించి కాపాడుకోగా, చేతికందే సమయంలో బోరుబావుల్లో నీరు రాని దుస్థితి నెలకొంది. చివరకు వరి పంటలకు నీళ్ల అందక రైతులు వాటిని పశువుల మేతకు వదిలేస్తున్నారు.

కరువు పరిస్థితులకు గత ప్రభుత్వమే కారణం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



దూలూర్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరం ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్

కథలాపూర్: రాష్ట్రంలో భూగర్భజలాలు అడుగంటిపోయి కరువు పరిస్థితులు నెలకొనడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని దుంపేటలో శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శుక్రవారం పూజలు చేశారు. అనంతరం దూలూర్‌లో పశువులకు ఉచిత గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు శిబిరాన్ని, రెడ్డి సంఘం భవనంలో కొత్తగా ఏర్పాటు చేసిన బోరుబావిని ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే మేడిగడ్డ బ్యారేజీని నాణ్యత లేకుండా నిర్మించారనే విషయం ప్రజలకు తెలిసిపోయిందన్నారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడి వారి తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వంపై రుద్దడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కలిగోట సూరమ్మ ప్రాజెక్టు త్వరలో పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు దివ్యశ్రీ, శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెదలు సత్యనారాయణ, పులి హరిప్రసాద్, కట్ట శంకర్, తొట్ల అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎం, ప్రభుత్వ విప్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ధర్మపురి : పద్మశాలీ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో శుక్రవారం పద్మశాలీ సంఘం అధ్యక్షుడు నక్క రాజేందర్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మచ్చ సత్యం, వరప్రసాద్ నరేశ్ పాల్గొన్నారు.

వెల్గటూర్ : మున్నూరుకాపు సంఘ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో స్తంభంపల్లి గ్రామ మున్నూరుకాపు సంఘ సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. మున్నూరుకాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ప్రకటించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాదం దుబ్బస్వామి, మార్గం సతీష్, తత్ర బుజ్జన్న, గొంటి కిరీటి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలజోన్: జగిత్యాల రూరల్ మండలంతో పాటు అర్బన్ మండలంలోని మహిళా సంఘాల ప్రతినిధులు, ఐకేపీ సిబ్బంది శనివారం తహసీల్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తూ మహిళల్లో వెలుగులు వస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మహిళా సంఘాల రూరల్ అధ్యక్షురాలు మారు సత్తవ్వ, అర్బన్ అధ్యక్షురాలు గంగాభవాని, ఏపీఎం గంగాధర్, సీసీలు గంగారాం, రవీందర్, సాగర్, మరియా, శ్రీనివాస్, వీవోఏలు జల, స్వప్న, రమ, అన్ని గ్రామాల మహిళా సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

కళాశాలలో వసతుల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శుక్రవారం గుడ్ మార్నింగ్ కోరుట్లలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. అక్కడి ఓపెన్ జిమ్, గ్రంథాలయం, ఇండోర్ స్టేడియంను పరిశీలించి తగినన్ని వసతులు కల్పిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జిందం లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పదో తరగతిలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సూచించారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యల గురించి ఆరా తీశారు. అలాగే పదో తరగతి విద్యార్థినులు పరీక్షలకు సిద్ధమవుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

అడెల్లి పోచమ్మకు మొక్కు చెల్లింపు

కోరుట్ల రూరల్: కోరుట్ల ఎమ్మెల్యేగా కల్వకుంట్ల సంజయ్ గెలిస్తే అడెల్లి పోచమ్మ తల్లికి మొక్కు చెల్లించుకుంటామని మండలంలోని నాగులపేట బీఆర్ఎస్ కార్యకర్తలు ఎన్నికల సమయంలో మొక్కుకున్నారు.ఎమ్మెల్యేగా సంజయ్ గెలవటంతో శుక్రవారం నాగులపేట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిర్మల్ జిల్లా సారంగాపూర్ అడెల్లి పోచమ్మ తల్లి ఆలయానికి వెళ్లి మొక్కు చెల్లించారు.ఎమ్మెల్యే సంజయ్ కూడా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

గంగపుత్ర కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం



మాట్లాడుతున్న రుత్త నారాయణ

మల్లాపూర్: ప్రభుత్వం గంగపుత్రుల కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని పీసీసీ ఫిషర్మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ అన్నారు. మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో శుక్రవారం మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్నందుకు నిదర్శనమే కొత్తగా 16 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడమేనని కొనియాడారు. కులవృత్తులకు అండగా నిలిచేందుకే సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమ్ముల చిన్నారెడ్డి, నాయకులు మామిడి రాజశేఖర్‌రెడ్డి, ఇప్పపెల్లి గణేష్, మొగిలి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించాలి



పనులకు శంకుస్థాపన చేసిన నాయకులు

మల్లాపూర్: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని వేంపల్లిలో పురాతన శివాలయం వద్ద కల్యాణ మండప నిర్మాణానికి మంజూరైన ఎంపీ ల్యాండ్స్ నిధులు రూ.4లక్షలతో చేపట్టనున్న పనులకు భూమిపూజ చేశారు. నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరాయన్నారు. తెలంగాణలో కేంద్రం అందిస్తున్న నిధులతోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుగ్లావత్ భూమిరాజేందర్, మాజీ ఎంపీటీసీ బిట్ల నరేష్, మాజీ ఉపసర్పంచ్ చందనగిరి తిరుపతి, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ కాపీ అందజేత

రాయికల్: మండలంలోని మైతాపూర్ ఉత్తరవాడ రెడ్డి సంఘ భవనానికి ఎంపీ నిధుల నుంచి రూ.4 లక్షలు మంజూరు కాగా, శుక్రవారం ప్రొసీడింగ్ కాపీని మండల అధ్యక్షుడు అన్నవేని వేణు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రాజనాల మధు, ఆకుల మహేశ్, నాయకులు మోత్కూరి శ్రీనివాస్‌గౌడ్, దొంగ లింగారెడ్డి, పాలడుగు లింగారెడ్డి, శివనీతి కిష్టయ్య పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని రామాజీపేట ఇప్పకాడ మున్నూరుకాపు కులసంఘ భవనానికి రూ.4లక్షలు ఎంపీ నిధుల నుంచి మంజూరు కాగా ప్రొసీడింగ్ కాపీని బీజేపీ మండల అధ్యక్షుడు అన్నవేని వేణు సంఘ నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల మహేశ్, అధ్యక్షుడు కోల రాజు, లచ్చన్న, శంకర్, భూమేశ్, రాజు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్‌గా దాసరి గంగాధర్



గంగాధర్

రాయికల్: పట్టణంలోని హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్‌గా దాసరి గంగాధర్, డైరెక్టర్లుగా కల్లెడ రాజు, రాయిల్ల ప్రభాకర్, నరంశెట్టి మనోజ్, వొజ్జల రాజిరెడ్డి, నోముల జ్యోతి, సందెల గణేశ్ నియామకం కాగా, శుక్రవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ మత్స్యకార సంఘం అధ్యక్షుడిగా రమేశ్



నియామకపత్రం అందిస్తున్న ఆది శ్రీనివాస్

మేడిపల్లి: కాంగ్రెస్ పార్టీ మత్స్యకార సంఘం మేడిపల్లి మండల అధ్యక్షుడిగా జిల్లా రమేశ్‌ను నియమిస్తూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని రమేశ్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ తోపారపు రజనీకాంత్, మండల నాయకులు తోకల నర్సయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే ఎమ్మెల్సీ కవిత అరెస్టు

కథలాపూర్: రాజకీయ కక్షతోనే ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి ఆరోపించారు. కథలాపూర్‌లో శుక్రవారం మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేసి బీజేపీ రాజకీయ లబ్ధిపొందాలని చూస్తుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటై బీఆర్ఎస్ పార్టీని అణిచివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు.

బీఆర్ఎస్ నాయకుల ఆందోళన

మెట్‌పల్లి: లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ పాత బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈడీకి వ్యతిరేకంగా నినాదాలు చేసి కవితను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కాన్షీరాం జయంతి వేడుకలు

మెట్‌పల్లి: బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతి వేడుకలను పట్టణంలోని మండల పరిషత్ పార్కులో శుక్రవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల లింబాద్రి, లక్ష్మణ్, సురేందర్, పాల్గొన్నారు.

ఘనంగా శివాలయ వార్షికోత్సవం

మెట్‌పల్లిరూరల్: మండలంలోని ఆత్మనగర్‌లో శివాలయ వార్షికోత్సవ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు.భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మల్లన్న స్వామి ప్రతిష్ఠాపన ఉత్సవాలు

మండలంలోని చింతలపేటలో మల్లన్న స్వామి ప్రతిష్ఠాపన ఉత్సవాలు జరుగుతున్నాయి. శుక్రవారం ఆలయంలో స్థాపిత దేవతా పూజ,రుద్రహోమం,ఇతర పూజలు నిర్వహించారు.

లలితాంబిక విగ్రహాల ఊరేగింపు

రాయికల్: పట్టణంలోని లలితాంబిక ఆలయ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని పుర వీధుల గుండా ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తమ్మినేని గంగాధర్, సభ్యులు సురతాని భాగ్యలక్ష్మి, తోకల రాజేందర్, సుభాష్‌రాజ్ పాల్గొన్నారు.

ద్వికోటి జ్యోతిర్లింగాలయ ప్రతిష్ఠకు ముస్తాబు



ముస్తాబైన ఆలయం

బుగ్గారం: జగిత్యాల బుగ్గారం మండల కేంద్రంలోని స్వయంభూ నర్మద పవిత్ర గోదావరి నదికి దక్షిణ దిక్కున బుగ్గారం ఎక్స్‌రోడ్డు వద్ద ద్వాదశ జ్యోతిర్లింగాలయ ప్రతిష్ఠకు ఆలయం ముస్తాబైంది. ఈనెల 16 నుంచి 18 వరకు ఆలయ వ్యవస్థాపకులు ఎలగుర్తి లక్ష్మీనారాయణ స్వామి ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్షి విద్యారణ్య భారతి మహా స్వామి వారి కరాకరములచే ప్రతిష్ఠోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు ప్రార్థులు కావాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

ప్రధాని, ఎంపీ బండి చిత్ర పటాలకు క్షీరాభిషేకం

మల్యాల: మండల కేంద్రంలోని మల్యాల అడ్డరోడ్డు వద్ద శుక్రవారం బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ, ఎంపీ బండి సంజయ్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. మల్యాల కాసారం రోడ్డు నిర్మాణం కోసం ఎంపీ బండి సంజయ్ రూ.25 కోట్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, మండలాధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ్, గాజుల మల్లేశం, నులుగొండ సురేశ్, కెల్లెటి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుల్లో రాణిస్తే భవిష్యత్తు

మెట్‌పల్లి: విద్యార్థులు చదువుల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని రవీంద్ర బాలికల కళాశాల కరస్పాండెంట్ సుద్దాల రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. కళాశాలలో శుక్రవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్ సుద్దాల హారిక, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులున్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

కోరుట్లరూరల్: మండలంలోని అయిలాపూర్‌లో రూ. 14 లక్షల అభివృద్ధి పనులకు ఎంపీపీ తోట నారాయణ, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య శుక్రవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చీటి స్వరూపా రాణి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, ఎంపీటీసీ గంగాధర్, నాయకులు పిడుగు సందయ్య,తుక్కారెడ్డి, అనంత స్వామి, నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజక్కపల్లిలో ..

వెల్గటూర్ : వెల్గటూర్ మండలం రాజక్కపల్లి గ్రామంలోని ఒడ్డెర కాలనీలో శుక్రవారం నూతన సీసీ రోడ్డు పనులకు పంచాయతీ కార్యదర్శి జ్యోతి నాయకులు మురళిగౌడ్, రమేశ్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం

మల్యాల: మండలంలోని కొండగట్టు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, పోతారం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు, తాటిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల వరకు, రాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

జగిత్యాలజోన్: జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల, పొలాస, బాలెపల్లి, కన్నాపూర్, హన్మాజీపేట, కండ్లపల్లి, గుల్లపేట, అనంతారం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, లక్ష్మీపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీపూర్, జాబితాపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పొలాస ఏఈ సుందర్ తెలిపారు.

పరీక్షా సామగ్రి అందజేత

వెల్గటూర్ : ఎండపల్లి మండలం పాతగూడూర్‌లో బాలాజీ మెడికల్ జనరల్ స్టోర్ ప్రారంభించి రెండేళ్లు అవుతున్న సందర్భంగా నిర్వాహకుడు శివ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందించారు.

బుగ్గారం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు కానిస్టేబుల్ వెంకటేశ్ గౌడ్ పరీక్షా సామగ్రి అందజేశారు. విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మండలానికి జిల్లా స్థాయిలో పేరుప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రవికుమార్‌గౌడ్, హెచ్ఎం మనోహర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలని ఎంపీటీసీల ఫోరం ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు వెంకట్ అన్నారు. మండలంలోని వర్షకొండ జెడ్పీహెచ్ఎస్ స్కూల్ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు.

కథలాపూర్: కథలాపూర్ మోడల్‌స్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు సిరికొండ సింగిల్‌విండో డైరెక్టర్ కందరి కిషన్‌రెడ్డి పరీక్ష సామగ్రి శుక్రవారం ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఏనుగు గంగారెడ్డి, ప్రిన్సిపాల్ తాటికొండ నరేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

మెట్‌పల్లిరూరల్: ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ తెలిపారు. ఎస్సీ కాలనీలో బోరు ఏర్పాటుకు రూ.2 లక్షలు, హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు రూ.1.35లక్షల నిధులు మంజూరు కాగా, శుక్రవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో స్థానిక పలువురు నాయకులు పాల్గొన్నారు.

సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డులు

కోరుట్ల: సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల రోజుల క్రితం నిర్వహించిన సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ ఒలంపియాడ్ ఎగ్జామ్స్ అవార్డులు కోరుట్ల పబ్లిక్ స్కూల్‌లో మూడో తరగతి విద్యార్థులు సుతారి శాన్విత, అరిసె విశ్వక్‌లతో పాటు 4వ తరగతి చదువుతున్న నిత్యశ్రీ, 5వ తరగతి చదువుతున్న శ్రీనిధిలకు వచ్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన అభినందించారు.

వాటర్ ప్యూరిఫైర్ వితరణ

రాయికల్: మండలంలోని కట్కాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మినరల్ వాటర్ కోసం గల్ఫ్‌సేవా సమితి ఆధ్వర్యంలో సుమారు రూ.14 వేల వ్యయంతో ఆక్వా వాటర్ ప్యూరిఫయర్‌ను అమర్చినట్లు ఎస్ఎంసీ చైర్మన్ గంగాధర్ తెలిపారు.

క్రీడల అభివృద్ధికి అథ్లెటిక్స్ అసోసియేషన్ కృషి

మెట్‌పల్లి: జిల్లాలో క్రీడల అభివృద్ధికి అథ్లెటిక్స్ అసోసియేషన్ కృషి చేస్తోందని జిల్లా అధ్యక్షులు భృగు మహర్షి పేర్కొన్నారు. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఆయనను శుక్రవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డితో పాటు పలువురు సన్మానించారు.